
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 32.0 కనిష్ఠం: 24.0






మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

పల్లె అందాలు

పల్లెటూర్లు సహజ అందాలకు మారు పేరు. పచ్చని పైర్లు కనువిందు చేస్తాయి. ఉదయమే ఎద్దుల బండ్లు, సామగ్రితో పొలాలకు వెళ్లే రైతుల సందడి కనిపిస్తుంది. కూలీ కోసం వెళ్లే మహిళల ముచ్చట్ల సవ్వడి వినిపిస్తుంది. పుస్తకాలకు అతుక్కుపోయిన పిల్లల్లో రేపటి భావిభారత పౌరులు కనిపిస్తరు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల వద్ద కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్





ఎద్దుల బండిపై పొలం వద్దకు వెళ్తున్న రైతులు



ఎద్దుల బండిపై వెళ్తూ కబుర్లు చెప్పుకుంటున్న మహిళలు



ఎద్దుల బండ్లపై, గుంటుకలు వేసుకొని పొలాలకు వెళ్తున్న రైతులు



చేపలను ఆరబెడుతున్న మహిళ



పశువుల పాకలో చదువుకుంటున్న బాలిక

వలపు వల

- హనీ ట్రాపింగ్‌కు గురవుతున్న 25-35 ఏళ్ల వయస్కులు
- బ్లాక్‌మెయిల్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- ఫిర్యాదు చేస్తే పరువు పోతుందనే భావనతో పోలీసుల ముందుకు రాని బాధితులు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో హనీ ట్రాప్‌కు గురవుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 30 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య గల పురుషులు, స్త్రీలను ఆకర్షిస్తున్న సైబర్ ముఠా వారి బలహీనతలను ఆసరాగా చేసుకొని లక్షల రూపాయలు దండుకుంటున్న వైనం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. మధ్య వయస్కులు ఉద్యోగ వ్యాపారస్తులు, స్థిరపడిన వారిని లక్ష్యంగా చేసుకొని హనీ ట్రాప్ ముఠా విజృంభిస్తోంది.

సోషల్ మీడియా ద్వారా..

హనీ ట్రాప్‌కు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాను పావుగా వాడుకుంటున్నారు. ఇన్ స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లను ఇందుకు వినియోగించుకుంటున్నారు. ఫేస్‌బుక్‌లలో అందమైన డీపీలను పెట్టడం ద్వారా యువకులను ఆకర్షిస్తున్నారు. ఈ క్రమంలో మధ్య వయస్కులైన మహిళలను కూడా టార్గెట్ చేస్తున్నారు. ఫేస్‌బుక్ డీపీలలో పెట్టే వివరాల ద్వారా మహిళల వయస్సు, వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకుంటున్న సైబర్ నేరగాళ్లు హాయ్ అనే మేసేజ్ 30 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయస్సున్న వారికి పంపడం ద్వారా చాటింగ్ కూడా చేస్తున్నారు. వారికి న్యూడ్, వాయిస్ మేసేజ్‌లు పెట్టడం ద్వారా బలహీనతలను కనుక్కొని బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్‌కు చెందిన ఒక బ్యాంక్ మేనేజర్ నెల రోజుల క్రితం సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి వారికి లక్షా 53 వేల రూపాయలు చెల్లించినట్లు సమాచారం.





నిర్భయంగా ఫిర్యాదు చేయండి

హనీ ట్రాపింగ్‌కు సంబంధించి ఎవరు వేధింపులకు పాల్పడినా నిర్భయంగా మాకు ఫిర్యాదు చేయండి. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతాం. సైబర్ నేరాలకు సంబంధించి సరైన అవగాహన లేకపోవడం వల్ల సామాన్యులతో పాటు విద్యావంతులు కూడా నష్టపోతున్నారు. సైబర్ నేరగాళ్లు ఇబ్బంది పెడితే ఫోన్ ద్వారానైనా సమాచారం ఇవ్వాలి. ప్రజల కోసం పని చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం.

- డీఎస్పీ, శ్రీనివాస్‌యాదవ్



ఎలా ట్రాప్ చేస్తారంటే..

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రముఖమైన వ్యక్తులు, వారి కుటుంబ సమాచారాన్ని తెలుసుకొని వారితో స్నేహ సంబంధాలు పెంపొందించుకుంటారు. ఫేస్‌బుక్‌లో వారి డీపీలు, సోషల్ మీడియాతో వారికుండే సంబంధాల గురించి మొత్తం రికార్డులను సేకరిస్తారు. వాట్సాప్ నెంబరు కూడా కనుక్కొని ఒకటి రెండు సందర్భాల్లో వారిని సంప్రదించిన తర్వాత ఆకస్మాత్తుగా వీడియో కాల్ చేస్తారు. నగ్నంగా తమ ఫొటోలు లేదంటే ఎదుటి వ్యక్తి ద్వారా వారికి నగ్న దృశ్యాలను ఫ్రంట్ కెమెరా ద్వారా సేకరించి మూడు నిమిషాల వ్యవధిలో నాతో మాట్లాడావ్ అర్ధనగ్నమైన ఫొటోలు చూశావ్, ఇదంతా మీ బంధువులు, మీ స్నేహితులకు సోషల్ మీడియా ద్వారా పంపిస్తానంటూ బెదిరిస్తారు. ఫేస్‌బుక్ ద్వారా స్నేహితులు, బంధువులకు పంపిస్తానంటూ మూడు నిమిషాల వ్యవధిలో మేసేజ్‌లు పంపిస్తారు. రోజుకు 10 సిమ్‌కార్డులను మార్చే ఈ ముఠా బీహార్, కోల్‌కతా, ఢిల్లీ, ముంబైలకు చెందిన వారని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే ఇటీవల నాగర్‌కర్నూల్‌లో ఓ బ్యాంక్ మేనేజర్‌తో పాటు గౌరవప్రదమైన మరో ఎనిమిది కుటుంబాలకు చెందిన మహిళలకు కూడా తొమ్మిది సెల్‌ఫోన్ల నుంచి హని ట్రాపింగ్‌కు సంబంధించిన ఫోన్‌కాల్స్ వచ్చినట్లు తెలిసింది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తమ పరువు పోతుందని వారు మిన్నకుండిపోయారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

- భార్య, అత్తా మామలపై అనుమానం

గట్టు, ఆగస్టు 11: జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో ఓ వ్యక్తి శనివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అయిజ మండలం ఎక్లాస్‌పురం గ్రామానికి చెందిన నర్సింహులు(39)కు, గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన జయమ్మలకు 15 ఏళ్ల కిందట వివాహమైంది. వివాహం అయ్యాక నర్సింహులు అత్తగారి ఊరు గొర్లఖాన్‌దొడ్డిలోనే ఉంటున్నాడు. గత కొన్ని రోజులుగా భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి నర్సింహులు, మామ కర్రెప్ప, అత్త సరోజమ్మ, భార్య జయ్యమ్మ గొడవ పడ్డారు. అదే రోజు రాత్రి నర్సింహులు అనుమానాస్పదంగా మృతి చెందాడు. గొంతు దగ్గర చేతితో పిసికినట్లు గుర్తులు, గాయాలు ఉన్నాయి. సీఐ భీమ్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తన అన్నని మామ కర్రెప్ప, భార్య జయమ్మ, అత్త సరోజమ్మ చంపారని అన్న పరశురాం ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి, దార్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కేటీ మల్లేష్ తెలిపారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

- మంత్రి దామోదర రాజనర్సింహ

మదనాపురం, ఆగస్టు 11: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం, కొన్నూరు గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ రహదారిపై ఉన్న జానంపేట వద్ద ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దేవరకద్ర ఆస్పత్రిని 100 పడకలకు, కొత్తకోట ఆస్పత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. జిల్లాకు ఒక డయాలసిస్ సెంటర్, ప్రతీ 15 కిలో మీటర్లకు ఒక పీహెచ్‌సీని సెంటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల పేదలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు.

అదనపు గదుల ప్రారంభం

కొన్నూరు గ్రామంలో సబ్ స్టేషన్, పీహెచ్‌సీ, గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించి, మాట్లాడారు. అన్ని దానాల్లో విద్యా దానం గొప్పదన్నారు. సామాజిక స్పృహతో శరత్‌రెడ్డి సుమారు కోటి రూపాయలతో గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను నిర్మించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. బన్నీ అనే విద్యార్థినిని పెద్ద అయ్యాక ఏం అవుతావని అడుగగా ఎమ్మెల్యేను అవుతానని చెప్పాడు. ఇంకో అమ్మాయి కలెక్టర్ అవుతానని, మరొకరు ఎస్పీ అవుతానని చెప్పారు. మంత్రి మాట్లాడుతూ కొన్నూరు గ్రామ ప్రజలు సేవ చేయడానికి ముందున్నారని ప్రశంసించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. అంతకు ముందు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి అనడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ప్రాజెక్టు పూర్తయిందని భారీ మీటింగ్ ఏర్పాటు చేసి, చెంబులు.. వాటర్ బాటిళ్లలో నీటిని పట్టుకొచ్చి గ్రామాల్లో పూజలు చేయాలని పిలుపునిచ్చిన సంగతి మరిచిపోయారా? అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, శరత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, పంచాయతీ రాజ్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తకోటలో మంత్రికి ఘన స్వాగతం

కొత్తకోట: కొత్తకోట పట్టణంలో మంత్రి దామోదర రాజనర్సింహకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిలతో కలిసి కొత్తకోట అంబా భవాని శంకర ఆలయంలోకి ప్రత్యేక పూజలు చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

మూసాపేట: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యాధికారులకు సూచించారు. మండలంలోని జానంపేట వద్ద గల ప్రభుత్వ ఆస్పత్రిని మంత్రి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడారు. డాక్టర్లు బాగా చూస్తున్నారని రోగులు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.



అంజమ్మను అభినందిస్తున్న తెలంగాణ అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి

ప్రభుత్వ న్యాయవాదిగా అంజమ్మ

వంగూరు, ఆగస్టు 10: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన కస్తూరి అంజమ్మను గవర్నమెంట్ రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాదిగా నియమించింది. అంజమ్మ, ఆమె భర్త సురేందర్ 11 ఏళ్లుగా హైకోర్టు న్యాయవాదులుగా పని చేస్తున్నారు. తనను ప్రభుత్వ న్యాయవాదిగా నియామకానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఫిషరీస్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్, తెలంగాణ అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజనికాంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడు కేవీన్‌రెడ్డిలకు అంజమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

జల విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభం

- వరద తగ్గడంతో జూరాల దిగువ కేంద్రంలో కొనసాగుతున్న కరెంట్ ఉత్పత్తి

ఆత్మకూరు, ఆగస్టు11: దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ఆదివారం పునఃప్రారంభించినట్లు జెన్‌కో ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎగువ నుంచి వరద ఉధృతి తగ్గిన కారణంగా ఆరు యూనిట్లను ప్రారంభించి, విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నట్లు చెప్పారు. కృష్ణానదికి 20 రోజులుగా రెండున్నర టీఎంసీలకుపైగా నీటిని విడుదల చేసిన కారణంగా విద్యుత్ ఉత్పత్తిని చేసే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. శనివారం అర్ధరాత్రి నుంచి వరద ఉధృతి తగ్గడంతో ఆదివారం తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. ఎగువ జూరాలలో గడిచిన 24 గంటలలో 2.541 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యిందన్నారు. ఇప్పటి వరకు మొత్తం 60.480 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశామన్నారు. దిగువ జూరాల కేంద్రంలో ఇప్పటి వరకు 33.619 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా, ఆదివారం ఉదయం నుంచి ఇప్పటి వరకు 0.6098 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశామని వివరించారు. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ రికార్డు స్థాయిలో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందన్నారు.



దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో కరెంట్ ఉత్పత్తి అనంతరం దిగువకు వదులుతున్న నీరు

జ్ఞాపకాలను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 11 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బేసిక్ ప్రాక్టీస్ పాఠశాలలో 1978-1979వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థులకు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 82 మంది విద్యార్థులు హాజరై గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఉత్సాహకంగా గడిపారు.

తెలంగాణ అద్దె వాహనాల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా రహమాన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 11 : తెలంగాణ రాష్ట్ర అద్దె వాహన కార్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరారాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో పలు కార్యాలయాల్లో అద్దెకార్లు నడుపుతున్న యజమానులు, డ్రైవర్స్ అంతా సమావేశమై సమస్యలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. అద్దెవాహన నెల బిల్లులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ విద్యాశాఖ అధికారి అద్దె వాహనం నడుపుతున్న సయ్యద్ సలీంరెహమాన్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎనున్నకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు అద్దె వాహనం యజమానులు, డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోని రహమాన్ సీనియర్ అని, ఆయన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఖాదర్ తెలిపారు.

అడవిపంది కళేబరాన్ని తరలిస్తున్న వ్యక్తులపై కేసు

మన్ననూర్, ఆగస్టు 11: అడవిపంది కళేబరాన్ని తరలిస్తున్న వ్యక్తులను మన్ననూరు చెక్‌పోస్టులో అటవీ అధికారులు పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. అమ్రాబాద్ ఎఫ్‌డీవో రామ్మూర్తి కథనం మేరకు వివరాలు... నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం అప్పాయపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులు రతనమోని శివరాం, బతికె శ్రీను, బతికె అంజయ్య అనే వ్యక్తులు వ్యవసాయ పొలంలో విద్యుత్ కంచెకు ఏర్పాటు చేసిన కరెం టు షాక్‌కు గురై అడవి పంది మృతి చెందింది. అమ్రాబాద్ మండలం తెలుగుపల్లి గ్రామానికి చెందిన రాసమోని బాలయ్య, కాల సత్యం అనే వ్యక్తులు అడవిపంది మాంసాన్ని విక్రయించాలనే ఉద్దేశంతో ఎల్మపల్లి గ్రామానికి చెందిన చారగొండ మహేశ్, పాండయ్య, రాజు అనే వ్యక్తులకు అప్పాయపల్లిలో ఉన్న అడవిపంది ని తీసుకురావాలని చెప్పగా, వారు ఆదివారం ఉదయం ఆటోలో అప్పాయపల్లికి వెళ్లి, చనిపోయిన అడవి పందిని ఆటోలో తెలుగుపల్లికి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో మన్ననూరు చెక్‌పోస్టులో డీఆర్‌వో రవి కుమార్, బీట్ అధికారి మధుసూదన్, ఇతర అటవీ సిబ్బంది వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. విచారణ చేయగా ఘటన లింగాల మండలం అప్పాయిపల్లిలో జరుగగా, స్వాధీనం చేసుకున్న ఆటో, అడవిపంది మృతదేహం, తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అటవీ అధికారులు లింగాల రేంజ్‌కు తరలించి అక్కడే కేసు నమోదు చేశారని ఎఫ్‌డీవో వివరించారు.



అడవి పందిని తరలిస్తున్న వ్యక్తులు, ఆటో

ఇన్‌చార్జి ఎంఈవోల పైరవీ !

- పోస్టు దక్కించుకునేందు నాయకులపై ఒత్తిడి
- ఆర్‌జేడీ జోక్యంతో సద్దుమణిగిన 'పాలమూరు ఎంఈవోల గొడవ'
- బదిలీ అయిన ఎంఈవోకు నాలుగు మండలాల బాధ్యతలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 11 : విద్యాశాఖలో అధికారులు కుర్చీల కోసం కొట్లాడుతున్నారు. రెగ్యులర్ ఎంఈవో, ఇన్‌చార్జి మండల విద్యా శాఖ శాఖ అధికారుల మధ్య ఈ వ్యవహారం మహబూబ్‌నగర్‌లో జరిగింది. గతనెల 31న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్జేడీ మండల విద్యాశాఖ అధి కారుల బదిలీలు చేసిన విషయం తెలిసిందే. మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న లక్ష్మణ్‌సింగ్ బదిలీలో మహబూబ్‌నగర్ మండలానికి వచ్చారు. ఆర్జేడీ ఉత్తర్వుల మేరకు జిల్లా కేం ద్రంలోని మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈవో కార్యాలయానికి వచ్చి విధుల్లో చేరారు. ఆయన అక్కడ ఎంఈవో కుర్చీపై కూర్చున్నారు. అప్పటి వరకు ఇన్ చార్జి ఎంఈవోగా ఉన్న జయశ్రీ కొద్దిసేపటి తర్వాత అక్కడికి వచ్చి తనకు సమాచారం ఇవ్వకుండా తన కుర్చీలో ఎలా కూర్చున్నావని లక్ష్మణ్‌తో తగువు పడ్డారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ మొదలై, ఇరువురూ ఈ విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. డీఈవో ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్లడంతో రెగ్యులర్ ఎం ఈవోను బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించడంతో ఆయన గత సోమవారం విధుల్లో చేరారు.

ఉమ్మడి జిల్లాలో ఉన్నది ఇద్దరే రెగ్యులర్ ఎంఈవోలు

విద్యాశాఖలో సుమారు 20 ఏళ్ల తర్వాత మండల విద్యాశాఖ అధికారుల బదిలీలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 76 మండలాలకు గాను ఎని మిది మంది రెగ్యులర్ ఎంఈవోలు కాగా, మిగతా వారంతా సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జి ఎంఈవోలుగా కొనసాగుతున్నారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఎంఈవో బదిలీలు చేపట్టింది. ఈ బదిలీల్లో ఆరుగురు ఎంఈ వోలు పాత రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు వెళ్లారు. ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరు ఎంఈవోలు మాత్రం మిగిలిపోయారు. ఇం దులో మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండల విద్యాశాఖ అధికారి గా పనిచేస్తున్న లక్ష్మణ్‌సింగ్ మహబూబ్‌నగర్ మండల విద్యాశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ ఎంఈవోగా పనిచేస్తున్న శంకర్‌నాయక్ కల్వకుర్తి మండల విద్యాశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. ఈ రెండు జిల్లాల్లో ఒక్కో రెగ్యులర్ ఎంఈవో మాత్రమే ఉన్నారు. మిగతా నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లా అసలు రెగ్యులర్ ఎంఈవోలే లేరు. అక్కడ సీని యర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మండల ఇన్‌చార్జి ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు.

సీటు వదిలేందుకు వెనకాడుతున్న ఇన్‌చార్జీలు

మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 17 మండలాలు ఉన్నాయి. ఇందులో గ తంలో ఇద్దరు రెగ్యులర్ ఎంఈవోలు ఉండేవారు. రెగ్యులర్ ఎంఈవోలుగా ఉ న్న గండీడ్ ఎంఈవోకు గండీడ్‌తో పాటు మహమ్మదాబాద్, రాజాపూర్, బాలా నగర్ మండలాలు ఇన్‌చార్జి బాధ్యతలు ఉండేవి. ఆ ఎంఈవో బదిలీలో రంగా రెడ్డి జిల్లాకు బదిలీపై పోయారు. సీసీకుంట ఎంఈవో లక్ష్మణ్‌సింగ్‌కు సీసీ కుంటతో పాటు కోయిలకొండ ఇన్‌చార్జి బాధ్యత ఉండేది. బదిలీలో మహబూ బ్‌నగర్ మండలానికి వచ్చారు. మిగతా 11 మండలాలకు సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జి ఎంఈవోలుగా కొనసాగుతున్నారు. మహబూబ్ నగర్ ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న ప్రభుత్వ పోలీస్‌లైన్ స్కూల్ జీహెచ్‌ఎం ఎం ఈవోగా కొనసాగుతున్నారు. దీనిపై డీఈవోను వివరణ కోరగా గండీడ్, రాజా పూర్, బాలానగర్, మహమ్మదాబాద్ మండలాల ఎంఈవో బాధ్యతలు కూడా గండీడ్ నుంచి శేరిలింగంపల్లికి బదిలీ అయిన వెంకటయ్యకు ఇచ్చినట్లు డీఈ వో తెలిపారు. ఆర్జేడీ నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయనే కొనసాగుతారని తెలిపారు.



మహబూబ్‌నగర్ అర్బన్ మండల విద్యాశాఖ కార్యాలయం

పాలెం వెంకన్నకు వెండి ఆభరణాల వితరణ


ఆభరణాలను ఆలయ అర్చకులకు అందజేస్తున్న దాతలు

బిజినేపల్లి, ఆగస్టు 11 : అలవేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామికి భక్తులు రూ.ఐదు లక్షల విలువైన వెండి ఆభరణాలను వారి తల్లిదండ్రులు వర్కాల జయప్రద, శ్రీరాములు జ్ఞాపకార్థం అందజేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కొరవి రామానుజాచార్యులు అన్నారు. మండలంలోని పాలెం గ్రామానికి చెందిన రాఘవేందర్, హారిక దంపతులు వారి కూతుళ్లు హరిప్రియ, లక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు వినయ్‌కుమార్, సాయిప్రసాద్ కలిసి శనివారం రాత్రి స్వామి వారికి వెండి కిరీటం, కర్ణాభరణం, సూర్యకటారి, అమ్మవారికి కిరీటం రూ.ఐదు లక్షలతో చేయించి స్వామి వారి కల్యాణంలో ప్రత్యేక పూజల అనంతరం అలంకరించినట్లు ఆదివారం ప్రధాన అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సీహెచ్ రంగారావు, సిబ్బంది బాబయ్య, శివకుమార్, భక్తులు గోపాల స్వామి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో యువకుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ చాటిన యువకులతో శ్రీహరి

కొల్లాపూర్, ఆగస్టు 11 : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కొల్లాపూర్ మండల యువకులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. గద్వాల జిల్లాలో ఈ నెల 10, 11వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో సీనియర్ విభాగాల పోటీల్లో కొల్లాపూర్ మండల పరిధిలోని యన్మన్‌బెట్ల గ్రామానికి చెందిన మంచాల ఉపేందర్ అండర్-74 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు మొలచింతలపల్లి గ్రామానికి చెందిన మద్దెం మల్లేష్‌యాదవ్, అండర్-58 కేజీల, అంజనేయులు అండర్-63 విభాగంలో ప్రతిభ కనబర్చినట్లు అంకిరావుపల్లి గ్రామానికి చెందిన చెనమోని భాస్కర్‌యాదవ్ అండర్-80కేజీల విభాగంలో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు తైక్వాండో మాస్టర్ శరబంద తెలిపారు. ప్రతిభ కనబర్చిన యువకులకు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీహరి బహుమతులు అందజేసినట్లు మాస్టర్ శరబంద తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ మనోహర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, జనరల్ సెక్రటరీ శేఖర్, కోశాధికారి అశోక్‌లు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత


నగదు అందజేస్తున్న స్నేహితులు

నవాబ్‌పేట, ఆగస్టు 11 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం రేవల్లి గ్రామంలో రాజు అనే వ్యక్తి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న అతని చిన్ననాటి (10వ తరగతి) స్నేహితులు పలువురు కలిసి ఆదివారం రూ.34,500 నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ తోటి స్నేహితుడు అనారోగ్యానికి గురి కావడం తమను తీవ్రంగా కలిచివేసిందని, అందుకే అందరం కలిసి నాణ్యమైన వైద్య ఖర్చుల నిమిత్తం నగదు అందజేసినట్లు తెలిపారు. మున్ముందు మరింత సహాయం అందజేస్తామని తెలిపారు.

ప్రజల జీవితాల నుంచే పాటలు పుడతాయి

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 11: ప్రజల జీవితాల నుంచే పాటలు పుడతాయని ప్రముఖ కవి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నెలపొడుపు సాంస్కృతిక, సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కవిత్వంపై నిర్వహించిన వర్క్‌షాప్ రెండో రోజు ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వం, సామాజిక దృక్పథం, సిద్ధాం తం పాట లక్షణమని, పాట రాయాలనుకునేవారు వీటిని పాటించాలని పేర్కొన్నా రు. అనంతరం దేశపతి శ్రీనివాస్‌తో పాటు విశిష్ట అతిథిగా హాజరైన పసునూరి రవీందర్‌ను ఘనంగా సన్మానించారు. నెలపొడుపు సాంస్కృతిక సాహిత్య వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి వహీద్‌ఖాన్, కవులు కల్వకోలు మద్దిలేటి, నీరటి బాలీశ్వర్, ఇద్రీస్, గౌస్ పాష, విజయ్‌కాంత్, దేవదానం, గడ్డపల్లి భూపాల్‌రెడ్డి, జక్కా గోపాల్, కృష్ణయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

భూత్పూర్, ఆగస్టు 11 : లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలో పడిపోయిన సంఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి 44వ జాతీయ రహదారి పైన చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా ఎవ్వాడు గ్రామానికి చెందిన పద్మరాజు శివశంకర్‌రాజు అలియాస్ శివ(48) అనే వ్యక్తి నెల్లూరు జిల్లాలోని కేఎంటీ ట్రాన్స్‌పోర్టులో లారీ డ్రైవర్ పదేళ్లుగా పని చేస్తున్నాడు. హైదరాబాద్ నుంచి మైసూర్‌కు లారీలో సామన్లు వేసుకొని వెళుతుండగా ఆదివారం అర్ధరాత్రి మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్ గ్రామ శివారులో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ పద్మరాజు శింవశంకర్ రాజు అలియాస్ (శివ) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడైన పద్మరాజ మోహన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

బైకులు ఢీకొని కింద పడ్డ వ్యక్తిపైకి దూసుకెళ్లిన డీసీఎం

- ఆస్పత్రికి తరలిస్తుండగా యువకుడు మృతి

జడ్చర్ల, ఆగస్టు 11 : రెండు బైకులు ఢీకొని కింద పడిన యువకుడిపైకి డీసీఎం దూసుకెళ్లిన సంఘటన ఆదివారం జడ్చర్ల పట్టణంలోని ఎంబీ చర్చి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని త్రిశూల్‌నగర్‌కు చెందిన సమీర్(23) ద్విచక్రవాహనంపై రాంగ్‌రూట్‌లో వెళ్తూ ఎదురుగా వచ్చిన మరో బైకు ఢీ కొట్టాడు. బైకులు ఢీ కొట్టుకోవడంతో సమీర్ రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో ఆ దారిలో వచ్చిన డీసీఎం బ్రేక్‌లు వేసినా, కంట్రోల్ కాకపోవడంతో రోడ్డుపై పడిన సమీర్ చేతిపైకి ఎక్కింది. సమీర్ చేతి నుజ్జు, నుజ్జు అయ్యింది. తీవ్రగా గాయపడిన సమీర్‌ను చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహం ప్రస్తుతం జడ్చర్ల ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఉంది.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి దేహశుద్ధి

జడ్చర్ల, ఆగస్టు 11 : జడ్చర్ల పట్టణంలోని క్లబ్‌రోడ్డులో దొంగతనానికి పాల్పడుతూ చిక్కిన వ్యక్తికి స్థానికులు దేహ శుద్ధి చేశారు. క్లబ్‌రోడ్డులోని ఓ వ్యక్తి ఇంటి ఆవరణలో ఉన్న పైపులతో పాటు మరికొంత సామగ్రిని దొంగతనానికి పాల్పడుతుండగా ఆదివారం ఓ వ్యక్తిని ఇంటి యజమాని పట్టుకున్నాడు. దొంగతానికి పాల్పడుతున్నాడని గ్రహించి, పరిసర ప్రాంత వాసులకు విషయం తెలిపాడు. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు సదరు వ్యక్తికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు.

ఇద్దరిపై గుట్కా కేసులు నమోదు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 11 : కల్వకుర్తి పట్టణంలో ఇద్దరిపై గుట్కా కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లోని టీస్టీ పాన్‌షాప్ నడుపుతున్న ఉమర్ షాపునుంచి రూ.2500 విలువగల గుట్కాప్యాకెట్లు, సుభాష్‌నగర్‌లో ఎస్‌ఆర్ పాన్‌షాపు నిర్వాహకుడు హాజీ వద్ద రూ.1500 విలువగల గుట్కాప్యాకెట్లను స్వాధీనంచేసుకుని వారిపై కల్వకుర్తి రెండవ ఎస్‌ఐ రామచంద్రజీ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి వివరించారు.

విద్యుదాఘాతంతో పశువుల మృతి

- రూ. 10లక్షల ఆస్తి నష్టమని బాధితుల ఆవేదన


మాచినేనిపల్లి శివారుతో తెగిపడిన విద్యుత్‌వైర్లు తగిలి మృతి చెందిన గేదెలు

కొల్లాపూర్, ఆగస్టు 11 : కొల్లాపూర్ మండల పరిధిలోని మాచినేనిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో తెగిపడిన 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి 9గేదెలు, ఒక ఆవు మృతి చెందాయి. సంఘటనకు సంబంధించిన వివరాలు... మాచినేనిపల్లి గ్రామానికి చెందిన 7మంది రైతులకు చెందిన 9గేదెలు, ఒక ఆవును మేపు కోసం వ్యవసాయ పొలంలోకి ఓ రైతు తీసుకెళ్లగా మేస్తున్న గేదెలు, ఆవు తెగిపడిన 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. వెంటనే గుర్తించిన రైతులు విద్యుత్ అధికారులకు సమాచారమందించి విద్యుత్ సప్లయ్‌ను బంద్ చేయించారు. మృతి చెందిన గేదె, ఆవుల విలువ దాదాపు పది లక్షలు ఉంటుందని తమ జీవనోపాధికి ఉపయోగపడే గేదెలు ఆకస్మాత్తుగా మృతి చెందడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వపరంగా తమకు నష్ట పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సంఘటన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు పగిడాల శ్రీనివాస్‌రెడ్డి మృతి చెందిన గేదెలను సందర్శించి రైతులను ఓదార్చారు. జరిగిన విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని రైతులకు పగిడాల శ్రీనివాస్‌రెడ్డి భరోసానిచ్చారు.

కుప్పగండ్లలో పాడిఆవు..

వెల్దండ : మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామంలో గోరెటి శ్రీశైలం అను రైతుకు చెందిన పాడిఆవు ఆదివారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. వ్యవసాయపొలంలో ఆవు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌వైరు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ సుమారు రూ.లక్షా 40వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వపరంగా తనను ఆదుకోవాలని ఈ సందర్భంగా రైతు కోరాడు.

పాల బిల్లులు చెల్లించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పాలఉత్పత్తిదారులు

నవాబ్‌పేట, ఆగస్టు 11 : రైతులకు విజయ డెయిరీ వారు చెల్లించాల్సిన పాల బిల్లులు వెంటనే చెల్లించాలని విజయ డెయిరీ ఛైర్మన్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బులు సకాలంలో అందకపోవడంతో పాల ఉత్పత్తిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారం నర్సింహులు, రుద్రారం శేఖర్, చెన్నయ్య, కొండయ్య, శంకరయ్య గౌడ్ ఉన్నారు.

మాడాపూర్‌లో పర్యటించిన అధికారులు

లింగాల, ఆగస్టు 11 : విష జ్వరాలతో బాధపడుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం లోని సూరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల మాడాపూర్ గ్రామాన్ని ఆదివారం ఎంపీడీవో అంజనేయులు ఆధ్వర్యం లో అధికారులు సందర్శించి గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలను నివారించవచ్చని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య శాఖ ఆధ్వర్యంలో సత్వర వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంక్ దగ్గర మిషన్ భగీరథ పైపులీకేజీని పరిశీలించి మరమ్మతులు చేయించారు. ఎంపీవో చంద్రశేఖర్, ఏఈ బలరాం, పంచాయతీ కార్యదర్శి లలిత, జీపీ సిబ్బంది, మిషన్‌భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు

వరుస దొంగతనాలతో భయం.. భయం

- బైక్, ట్రాక్టర్ల బ్యాటరీలను కొట్టేసిన కేటుగాళ్లు
- చౌరస్తా పరిసరాల్లో పని చేయని సీసీ కెమెరాలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

కోయిలకొండ, ఆగస్టు 11 : మండల కేంద్రంలో కొన్ని రోజుల నుంచి వరుస దొంగతనాలతో కోయిలకొండ వాసులు భయం గుప్పెట్లో గడుపుతున్నారు. గత 8వ తేదీ గురువారం రాత్రి చౌరస్తా ప్రాంతంలోని వీరభద్రస్వామి కమాన్ ప్రాంతంలో నివసించే డి. శ్రీనివాస్‌కు చెందిన టీవీఎస్ లూనాను ఎత్తికెళ్లారు. ఇది మరువక ముందే గ్రామానికి చెందిన కుమ్మరి శివకు చెందిన ట్రాక్టర్ ఆదిహనుమాన్ దేవాలయం పక్కన నిలుపగా ట్రాక్టర్ బ్యాటరీని శనివారం రాత్రి దుండగులు ఎత్తికెళ్లారు. 15 రోజుల క్రితం గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పెట్టిన బైక్ దొంగతనం కావడం జరిగింది. కొన్ని రోజుల నుంచి చౌరస్తా ప్రాంతంలో జరుగుతున్న దొంగతనాలతో ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చౌరస్తా నెంచి ఎంపీడీవో కార్యాలయం వరకు వేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఇవే అదునుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో పాటు చౌరస్తా నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై కూడా సీసీ కెమెరాలు లేవు. గతంలో ఎస్‌బీఐ బ్యాంకు తాళాలు పగలగొట్టి దొంగతనానికి యత్నించారు. దీంతో పాటు చిన్న చిన్న వ్యాపార దుకాణాల్లో సామగ్రి దొంగతనానికి గురయ్యాయి. చౌరస్తా ప్రాంతంలో డివైడర్ లైట్లు మధ్యరాత్రి పలుమార్లు కరెంట్ ఉన్న బంద్ అవుతాయని ఈ ప్రాంత వాసులు తెలిపారు.

పెట్రోలింగ్ బంద్ కావడంతోనే....

కొన్ని నెలల నుంచి మండల కేంద్రంలో పోలీసుల పెట్రోలింగ్ బంద్ కావడంతోనే కోయిలకొండ లో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని చౌరస్తా ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పోలీసుల పహారా లేకపోవడం అదనుగా చేసుకొన్న దొంగలు చౌరస్తా ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని వ్యాపారుస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీరామకొండ కింది ప్రాంతంలో బైక్‌లు తిరుగుతాయని ప్రజలు వాపోతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోయిలకొండ వాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మండల కేంద్రంలో వరుస దొంగతనాలపై చర్యలు తీసుకొంటాం. మండల కేంద్రంలోని చౌరస్తా ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను బాగు చేయించి దొంగతనాలు నివారిస్తాం. మద్యం బానిసలు డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారు. పెట్రోలింగ్ పెంచుతాం.

- భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ, కోయిలకొండ


దుండగులు ట్రాక్టర్ బ్యాటరీని దొంగిలించిన దృశ్యం

పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత

కోయిలకొండ మండలంలో 44 గ్రామపంచాయతీలు, 78 గిరిజన తండాలు ఉన్నాయి. పెద్ద మండలం అయిన కోయిలకొండ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉంది. ఇక్కడ ఉన్న ఏఎస్‌ఐ కోర్టు విధుల్లో ఉండగా 21 మంది కానిస్టేబుళ్లకు నాలుగురు మాత్రమే ఉన్నారు. పోలీస్ స్టేషన్‌లో అవసరం ఉన్న సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి వినతి



నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 11: మునిసిపాలిటీ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వర్ధం పర్వతాలు మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించామని, తమ సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రధానంగా పట్టణంలోని శ్రీపురం రోడ్డు బీసీ కాలనీ ప్రజలు ఎన్నో ఏళ్లుగా డ్రైనేజీ, మంచినీరు, వీధిలైట్ల సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకోలేదని, కేవలం డ్రైనేజీ పేరిట రోడ్లు తవ్వి మురుగునీరు బయటికి పోకుండా చేశారన్నారు.

అదేవిధంగా పట్టణంలోని పలు కాలనీల్లో సగం సగం సీసీ రోడ్లు వేశారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మాణం పూర్తి అయినా వాటిని పేదలకు అప్పగించలేదని, దీంతో వారు వేలకు వేలు అద్దె చెల్లించి కిరాయి ఇంట్లో ఉంటూ కష్టాలు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని పట్టణంలో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని ఆయన కోరారు. సీపీఎం నాయకులు ఆర్.శ్రీనివాస్, గీత, రామయ్య, యాదయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ దేవతను దర్శనం చేసుకున్న భక్తులు



నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శనం చేసుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 11 : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తులకు కొంగుబంగారుగా వెలసిన మైసమ్మ దేవతను భక్తులు దర్శనం చేసుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం పదివేలకు మందికి పైగా భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం ఒక లక్ష 50వేల రూపాయల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్షుడిగా వేణుగోపాలాచారి



వేణుగోపాలాచారి

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 11 : కల్వకుర్తి పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా వేణుగోపాలాచారిని ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన ఎన్నికలో ఆయన విజయం సాధించారని, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రవీంద్రాచారి చేతులమీదుగా నియామకపత్రాన్ని అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలాచారి మాట్లాడారు. పట్టణంలోని స్వర్ణకార సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గెలుపుకోసం కృషి చేసేవారికి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి రమేష్‌చారి, ఎన్నికల అధికారులు యాదగిరిచారి, జగన్‌మోహన్‌చారి, ఆంజనేయులు, దక్షిణామూర్తి, నాయకులు ముమ్మడి శ్రీనివాసచారి, రమేష్‌బాబు, దయాకర్, మల్లికార్జున్, అశోక్ పాల్గొన్నారు.

'గెస్ట్ లెక్చరర్లను వెంటనే రెన్యువల్ చేయాలి'

కల్వకుర్తి, ఆగస్టు 11 : తెలంగాణ రాష్ట్రంలోని 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పది సంవత్సరాల నుంచి పని చేస్తున్న 1654మంది గెస్ట్‌లెక్చరర్లను వెంటనే రెన్యువల్ చేయాలని గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర నాయకుడు సదానందంగౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం జూలై నెలకు మాత్రమే రెన్యువల్ ఇచ్చిందని నెల పూర్తై 11రోజులవుతున్న ఇప్పటికీ మళ్లీ రెన్యువల్ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గెస్ట్ లెక్చరర్లందరం రాష్ట్రంలోని మంత్రులను, సంబంధిత అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించామని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. కళాశాలల్లో గెస్ట్‌లెక్చరర్లు విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నామని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన కోరారు.

మద్యం తాగి వాహనాలు నడుపరాదు



ఊర్కొండలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై వీరబాబు

ఊర్కొండ, ఆగస్టు 11: మద్యం తాగి వాహనాలు నడుపరాదని ఎస్సై వీరబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలతో పాటు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలను మైనర్లు డ్రైవింగ్ చేయరాదని అలా చేస్తే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిత్యం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటుచేసుకుంటాయని వాహన చోదకులకు అవగాహన కల్పించారు. రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరుగ వని అన్నారు. ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురువుతాయని, కుటుంబాల గురించి ప్రతీ వాహన చోదకుడు ఆలోచన చేయాలని తెలిపారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

తిమ్మాజిపేట, ఆగస్టు 11 : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో తిమ్మాజిపేట మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. ప్రత్యేక పాలనలో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదని డ్రైనేజీలలో మురుగు పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా గ్రామంలోని పాఠశాల భవనం శిథిలావస్థ స్థితిలో ఉందని నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని గ్రామంలో అవసరమైన వీధులలో సీసీ రోడ్లు మంజూరు చేయించాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేరేళ్లపల్లి మనోహర్, మాజీ సర్పంచ్‌మల్లయ్య, వెంకటయ్య సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి గ్రామస్థుల విరాళం

నర్వ, ఆగస్టు 11 : మండలంలోని ఉందెకోడ్ గ్రామంలో ధనలక్ష్మి గుడి నిర్మాణానికి ఆదివారం గ్రామస్థులు ఒక్కొక్కరు రూ.10 వేలకు తగ్గకుండా విరాళాలు అందజేశారు. అదే విధంగా ఈనెల 14న బుధవారం శ్రావణ ఏకాదశి రోజున శ్రీ ధనలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం పూజా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయల కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆరు నెలలక్రితం రూ.50 లక్షల అంచనాతో ఆధునాతన పద్ధతితో గుడిని నిర్మించినట్లు తెలిపారు.

రోడ్లపైనే విద్యుత్ స్తంభాలు



వెల్దండలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

వెల్దండ, ఆగస్టు 11 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతున్నది. ఏళ్లకాలంగా విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలో ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిలో మూలమలుపులో సిమెంటు రహదారి ఏర్పాటుచేసినా అక్కడ విద్యుత్ అధికారులు దశాబ్దాలకాలం క్రితం ఏర్పాటుచేసిన ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీలు, కార్లు వంటి వాహనాలు వెళ్లేందుకు రోడ్డు ఉన్నప్పటికీ విద్యుత్ స్తంభం రోడ్డు మధ్యలో ఉండటంతో ఇబ్బందులు తప్పడంలేదు. అదేవిధంగా గ్రామంలోని ప్రధాన రహదారినుంచి హనుమాన్ దేవాలయానికి వెళ్లే రహదారిలో ఇదే పరిస్థితి ఉంది. కాగా ఈ ఇనుప స్తంభాలు ఏళ్లకాలం క్రితం ఏర్పాటు చేయడంతో శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతాయోనన్న ఆందోళన నెలకొంది. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు సైతం జరిగే అవకాశాలు ఉన్నాయి. పలుమార్లు సమస్య గురించి సంబంధిత అధికారులకు చెప్పినా ఫలితం కానరావడం లేదు. ఇనుప స్తంభాలను రోడ్డుమధ్యలో నుంచి తొలగించి వాటి స్థానంలో రోడ్డు పక్కగా సిమెంటు స్తంభాలు నాటాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మొదలెట్టారు.. వదిలేశారు



గుంతలమయమైన కొరటికల్- కంసానిపల్లి లింకు రోడ్డు

ఉప్పునుంతల, ఆగస్టు 11: ఎన్నో ఏళ్లుగా రోడ్డు నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న మండల ప్రజలకు కొరటికల్-కంసానిపల్లి వరకు 4 కిలోమీటర్ల లింకు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతుండటంతో మండలంలోని కొరటికల్, కంసానిపల్లి వెల్టూరు, అయ్యవారిపల్లి, పిర్వటోనిపల్లి, గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల గ్రామాల ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కానీ నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించి ఉన్న రోడ్డు ఇరు వైపులా మట్టి పోసి మధ్యలో ఎర్రమట్టి పోసి వదిలేసి నెల రోజులు కావస్తున్నా అటు వైపు కాంట్రాక్టర్ మళ్లీ చూడలేదు. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహన చోదకులకు, ప్రయాణికులకు కష్టంగా మారింది. తప్పని పరిస్థితులలో ఎవరైన వెళ్తే జారిపడిపోవడం తప్పా ప్రయాణం ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేసి రోడ్డు పూర్తి చేసి మండల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదాలకు నెలవు మూలములుపులు

- ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రమాద సూచిక బోర్డులు పెట్టాల్సిన ఊర్కొండ-ఊర్కొండపేట రోడ్డులోని మూలమలుపు

ఊర్కొండ, ఆగస్టు 11: మండలంలోని పలు రోడ్లలో ఉన్న మూలమలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రం నుంచి అభయాంజనేయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు, ఊర్కొండపేట-జకినాలపల్లి రోడ్డులో ఉన్న మూలములుపులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. మూలమలుపుల వద్ద తరుచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ఊర్కొండ గేటు నుంచి ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయానికి శనివారం, మంగళవారం భక్తులు తండోపతండాలుగా తరలివస్తుంటారు.

ఈ రహదారి గుండా ప్రయాణం చేయాలంటే అరచేతిలో ప్రాణం పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఈ రోడ్డులో మూలమలుపులు ప్రమాదంగా ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాటి వద్ద ప్రమాద సూచిక బోర్డులు పెట్టాలని భక్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కరాటే సాధనతో ఆత్మరక్షణ



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి, ఉప్పల వెంకటేశ్

కల్వకుర్తి, ఆగస్టు 11 : కరాటే సాధనతో ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు కరాటేలోనూ రాణించాలని ఆయన సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండవ జాతీయ స్థాయి ఓపెన్ టు ఆల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉప్పల వెంకటేశ్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కరాటే పోటీలను వారు ప్రారంభించారు. పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన కరాటే క్రీడాకారులు హాజరయ్యారు. అనతరం జరిగిన సమావేశంలో ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది పేదరికంలో పుట్టిన వారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని చదువుతో పాటు క్రీడలు, కరాటేలో ప్రతిభ చాటాలని సూచించారు. బీజేపీ నాయకులు బండెల రాంచంద్రారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్‌వీ కల్వకుర్తి అధ్యక్షుడు ధారమోని గణేష్, బీఆర్ఎస్ నాయకులు తాళ్ల సురేష్‌గౌడ్, కేటీఆర్ సేవా సమితి అధ్యక్షుడు సురేందర్, నాయకులు నాగరాజు, శ్రీనివాసులు, నిర్వాహకులు కిరణ్‌నాయక్, మల్లికార్జున్, పలువురు కరాటే క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలే నిరుద్యోగానికి కారణం

- ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 11: దేశంలో నిరుద్యోగం పెరుగడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో ప్రభుత్వరంగ సంస్థలు నిరుద్యోగ సమస్య తీవ్రమైందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరగడానికి సమతుల్యత లేని అస్తవ్యస్తమైన ఆర్థిక విధానాలేనన్నారు. దేశ జనాభాలో సగం మంది యువత ఉన్నారని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో మోదీ ప్రభుత్వం విఫలం అయ్యిందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రజల్లో వైషమ్యాలు పెంచేవిగా ఉన్నాయని ఆరోపించారు. జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కల్పించాలన్నారు.

యువత డ్రగ్స్, మారకద్రవ్యాల బారిన పడకుండా చైతన్య పరచాలని ఆయన ఏఐవైఎఫ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్, శివకృష్ణ, శివలీల, బాలపీరు, ధర్మరాజు, కుర్మయ్య, లక్ష్మీపతి, శివకుమార్, సాయితేజ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కందనూలు, ఆగస్టు 11 : నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ స్కూల్‌లో ఆదివారం అవీస్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైనట్లు లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ లయన్ తెప్ప శ్రీను తెలిపారు. వెరికోస్ మెయిన్స్ (ఉబ్బిన నిరలు) సమస్యలతో బాధపడుతున్న 350మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ రాధాకృష్ణ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ చేపట్టే హెల్త్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అవీస్ హాస్పిటల్ డాక్టర్ గణేష్, రుద్రేష్, సిబ్బంది జగదీశ్, కృప, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ రాధ, ట్రెస్సార్ నాగరాణి, జిల్లా చైర్మన్ రాజావర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తిటౌన్: పట్టణంలోని సత్యసాయి మందిరంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. వైద్య శిబిరంలో రోగులకు కంటి, మధుమేహ, రక్తపోటు పరీక్షలను నిర్వహించారు. 412 మందికి నిర్వహించి 9 మందికి శస్త్రచికిత్స అవసరమని, మిగతా వారికి రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి వారికి తగిన మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. నిరుపేదలు ప్రతీ ఒక్కరు వైద్యసేవలను పొందాలని ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు కోరారు. అనంతరం సత్యసాయిబాబా మధ్యాహ్న హారతి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైద్యులు రాజేష్‌గుబ్బా, సాయి చరణ్‌గుబ్బా, చంద్రకాంత్, సింధూ, సౌమ్య, శ్రీధర్, సత్య సాయి సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తి సత్యసాయి మందిరంలో మందులు అందజేస్తున్న ఎడ్మ సత్యం

● అచ్చంపేట: వాకర్స్ అసోషియేషన్, లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మధుమేహ వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యాధికారులు డాక్టర్లు లింగాచారి, వెంకటేష్, లింగారెడ్డి, కిష్టయ్యగౌడ్‌లు 150 మంది వాకర్స్‌కు మధుమేహ పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేష్, సెక్రటరీ పోల శ్రీనివాస్, ట్రెజరర్ శివ శంకర్, నరసింహారావు, చంద్రకుమార్, నరేష్, గణపతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బిజినేపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బిజినేపల్లి, ఆగస్టు 11 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1981-82 విద్యా సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 42 ఏళ్ల తర్వాత చదువుకున్న పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎప్పుడో నలభై ఏళ్ల క్రితం విడిపోయిన బాల్య మిత్రులు ఒక్కరినొకరు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నాటి మధుర స్మృతులను, జ్ఞాపకాలను, అల్లరి చేష్టలను గుర్తు చేసుకొని సంబరపడ్డారు. ఇక్కడ చదువుకున్న తోటి స్నేహితులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని అన్నారు. తమ ఉన్నతికి కారణమైన చదువు చెప్పిన గురువులను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులైన డాగోజీరావు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం నాటి స్మృతులను గుర్తు చేసి ఇంతటి తీపి జ్ఞాపకాలను తిరిగి ఆస్వాదించేలా చేసిన పూర్వ విద్యార్థులను మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, అలాగే జీవితం సంతోషంగా సాగించాలని ఆకాంక్షించారు.

పూర్వపు గురువులు బాల్ లింగయ్య, బాలకృష్ణయ్య, శేషాద్రి, డాగోజీరావులను శాలువాలు, పూలమాలలతో పూర్వ విద్యార్థులు రామచంద్రయ్య, వెంకట్ నారాయణ, శివరామకృష్ణ, అంజన్ రెడ్డి, రాజేశ్వర్, పద్మ, రాజేశ్వరి, శ్యాంప్రసాద్‌లు ఘనంగా సన్మానించారు.



సమ్మేళనంలో పాల్గొన్న 2006 - 2007 బ్యాచ్ విద్యార్థులు

● కల్వకుర్తిటౌన్: పట్టణంలోని నిర్మలవిద్యాలయంలో 2006 - 2007 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం పరిణయం ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయసమ్మేళనం ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందరు ఆనాడు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను వేడుకకు ఆహ్వానించి వారిని పూలమాలలు, శాలువాలతో సన్మాంచి, ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మునిసిపల్ కౌన్సిలర్ షేక్ రహీంపాషా

కొల్లాపూర్, ఆగస్టు 11 : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 10వ వార్డుకు చెందిన అనారోగ్య బాధితురాలు బద్దుల లక్ష్మీదేవమ్మకు ప్రభుత్వపరంగా మంజూరైన 27వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం మునిసిపల్ కౌన్సిలర్ షేక్.రహీంపాషా అందజేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అనారోగ్య బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, మంజూరవుతున్న సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా ప్రజలకు చేరవేస్తామని మునిసిపల్ కౌన్సిలర్ షేక్.రహీంపాష పేర్కొన్నారు. అదేవిధంగా వార్డులో పలువురికి కల్యాణలక్ష్మీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు ఆయన తెలిపారు.

●పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని మారేడుమానుదిన్నె గ్రామానికి చెందిన బొల్లం నాగమణికి సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరైన చెక్కును మాజీ జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ అందజేశారు. సీఎంఆర్ఎఫ్ పథకం నుంచి మంజూరైన 28వేల 500రూపాయల చెక్కును బాధితురాలికి ఆమె అందజేశారు. మాజీ ఉప సర్పంచ్ శ్రీధర్‌రావు, జెట్టి రాములు, జటమోని రేణుక, రాముడు, బొల్లం శివ, కేతావత్ షైబునాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడికి సన్మానం



రవినాయక్‌ను శాలువాతో సన్మానించి స్వీటు తినిపిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు

చారకొండ, ఆగస్టు 11: మండల పరిధిలోని అగ్రహారంతండాకు చెందిన నేనావత్ రవినాయక్ ఇటీవల బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు రవినాయక్‌ను శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈసందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతానని అన్నారు. తండాల్లో బీజేపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రవినాయక్ పేర్కొన్నారు.

ఎస్సీల్లోని 59 కులాలకు న్యాయం

వంగూరు, ఆగస్టు 11: వర్గీకరణతోనే ఎస్సీల్లోని 59 కులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గెల్వయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 సంవత్సరాల పోరాటం ఫలితంగానే సుప్రీం కోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పువచ్చిందన్నారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించిన సిదార్థ లూద్రాను ఢిల్లీలోని ఆయన నివాసం కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు గెల్వయ్య పేర్కొన్నాడు. ఎస్సీవర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై మాదిగ ప్రతినిధులు కమిటీ వేసుకొని ముందుకు వెళ్లాలని కోరారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

బల్మూరు, ఆగస్టు 11 : ఇటీవల కాలంలో ఉపాధ్యాయులకు పదోన్నతి లభించడం పట్ల మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు డి.బాలస్వామి, మండల వెంకటనారాయణ, ఆర్.తిరుపతయ్య, బాలయ్య, పి.విజయతోపాటు కొండనాగుల గ్రామానికి చెందిన డాక్టర్ దాసరి మౌలాలిలను స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు మండల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఖదీర్, తాజా మాజీ సర్పంచ్ శివశంకర్, సంఘం సభ్యులు శ్రీనివాసులు, ఎతిరాజు, శ్రీహరి, నరేష్, పర్వతాలు, బాలరాజు, వెంకటయ్య, ఆంజనేయులు, కాంగ్రెస్ యువ నాయకులు ఫాజిల్, విద్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహ సమస్యలు పరిష్కరించాలి

వెల్దండ, ఆగస్టు 11 : మండల కేంద్రంలోని బీసీ వసతిగృహంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. ఆదివారం పీడీఎస్‌యూ నాయకులు వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వసతిగృహానికి మరమ్మతులు చేయించాలని, మురుగుకాల్వను తొలగించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. మధు, రమేష్‌యాదవ్ ఉన్నారు.